జిల్లా సమాఖ్య పనితీరు భేష్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 6 : జిల్లా సమాఖ్య పనితీరు అభినందనీయమని డీఆర్డీవో చందర్‌నాయక్ అన్నారు. మార్కెటింగ్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో వానకాలం, యాసంగి (2022-23)లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా రూ.21.97 లక్షల కమీషన్ సాధించారని తెలిపారు. డిచ్‌పల్లిలోని సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రంలో ఇందూరు జిల్లా మహిళా పరస్పర సహకార సమాఖ్య 77వ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించగా.. ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మండల సమాఖ్య అధ్యక్షురాలు రాధను జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో మధుసూదన్, డీవీఎంలు శ్రీనివాస్, రాచయ్య, సంధ్యారాణి, నీలిమా, మారుతి, సఖీ సెంటర్ సిబ్బంది, అన్ని మండలాల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు

దాతకు సన్మానం

ప్రదీప్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ముప్కాల్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం కోసం మండల కేంద్రానికి చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు రిజర్వుడ్ ఎస్సై ప్రదీప్ తనవంతు సాయంగా 50 వేల రూపాయలను సోమవారం రాత్రి నిర్మాణ బాధ్యులకు అందజేశారు. దాతను నిర్మాణ బాధ్యులు క్రీడాకారులు సన్మానించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.గంగాధర్ మాట్లాడుతూ.. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు.

రాష్ట్ర డీజీపీ రవిగుప్తాను మంగళవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని డీజీ పీ ఆఫీస్‌లో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

-వినాయక్‌నగర్, ఫిబ్రవరి 6

జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి న్యూఢిల్లీలో ఎంఎస్ఎంఈ మంత్రి నారాయణ్ రాణేను మంగళవారం కలిశారు. పసుపు రైతుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఎగుమతులు, దిగుమతుల ద్వారా పసుపు పంటకు అధిక మద్దతు ధర వచ్చేలా, భవిష్యత్తులో పసుపు బోర్డు ఏర్పాటు చేసి రైతులను అన్నిరకాల ఆదుకోవాలని కోరినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు.

-జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 6

ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలి

ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 6 : ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటించాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు కలెక్టర్ వరుసగా రెండో రోజైన మంగళవారం ఈవీఎం గోడౌన్‌ను సందర్శించారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు, పరిశీలన కోసం ఈసీఐఎల్ ఇంజినీర్లు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

బాలుడి కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్టు

పరారీలో మరో నిందితురాలు

వినాయక్ నగర్, ఫిబ్రవరి 6: జిల్లాకేంద్రంలో సంచలనం సృష్టించిన ఓ బాలుడి కిడ్నాప్ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇదే కేసులో పరారీలో మరో నిందితురాలి కోసం గాలిస్తున్నారు. మాలపల్లి ప్రాంతానికి చెందిన మహ్మద్ మీహాజ్ అనే బాలుడిని కిడ్నాప్ ముఠా గత జనవరి 30న అపహరించి హైదరాబాద్‌లో విక్రయించగా.. ఈ కేసును సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి, నాలుగు రోజుల వ్యవధిలో కిడ్నాప్ ముఠాను గుర్తించారు. బాలుడిని కిడ్నాప్ చేసింది స్థానికంగా ఉండే సోహెల్ అనే యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సోహెల్‌ను విచారించగా.. కిడ్నాప్ ముఠాలో ప్రధాన సూత్రధారి మాలపల్లి ప్రాంతానికి చెందిన షబానా బేగంగా తేలింది. ఈ ముఠాలో జిల్లా కేంద్రానికి చెందిన ఐదుగురు సభ్యులతో పాటు హైదరాబాద్‌కు చెందిన మరో మహిళ మొత్తం ఆరుగురు ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు మంగళవారం తెలిపారు. సోహెల్‌తోపాటు ఆబీద్, షబానా బేగం, జరీనా, చాంద్ పాషా ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా.. 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. బాలుడి కిడ్నాప్‌తో సంబంధం ఉన్న హైదరాబాద్‌లోని ఫలక్‌నామాకు చెందిన ఆలీయా అనే మరో నిందితురాలు పరారీ ఉందని, ఆమె కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

జైలుకెళ్లి వచ్చినా మారని తీరు

బాలుడి కిడ్నాప్ కేసులో నిందితురాలైన షబానా బేగం గతంలో జైలుకెళ్లి వచ్చినా తీరుమారలేదు. గతేడాది సెప్టెంబర్ నెలలో ఓ బిడ్డను కొనుగోలు చేసేందుకు ఆశ కార్యకర్తతో బేరం కుదుర్చుకున్న కేసులో జైలుకు వెళ్లి వచ్చింది. తాజాగా మళ్లీ కిడ్నాప్ కేసులో మరోసారి జైలుకు వెళ్లింది.

ప్రైవేట్ పాఠశాలలు అప్రమత్తం

జిల్లాలో వరుస కిడ్నాప్ ఘటనల నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు అప్రమత్తమయ్యాయి. తమ పాఠశాలలకు ప్రతిరోజూ బస్సు, ఆటో, వ్యాన్‌లో వచ్చే విద్యార్థులు సురక్షితంగా ఇండ్లకు చేరేలా వారి తల్లిదండ్రులు దగ్గరుండి చూసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఈ మేరకు కొన్ని పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులకు సమాచారం అందించాయి.

ప్రత్యేకాధికారికి సన్మానం

రుద్రూర్, ఫిబ్రవరి 6: రుద్రూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ వెంకటేశాన్ని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో విండో మాజీ చైర్మన్ పత్తి రాము, మాజీ ఉప సర్పంచ్ డౌర్ సాయిలు, సీనియర్ నాయకులు మొద్దుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకమండలి సభ్యులకు..

ఇందల్వాయి, ఫిబ్రవరి 6 : మండలంలోని దేవితండా, మెగ్యానాయక్ తండా గ్రామాలకు చెందిన పాలకమండలి సభ్యులను మంగళవారం ఆయా గ్రామాల్లోని యువకులు ఘనంగా సన్మానించారు.

డిచ్‌పల్లి విండో చైర్మన్ రాజీనామా

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 6 : డిచ్‌పల్లి సహకార సంఘం చైర్మన్ గజవాడ జైపాల్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని డీసీవో శ్రీనివాస్‌రావుకు మంగళవారం అందజేశారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బాడ్సిలో 25 కిలో గంజాయి పట్టివేత

- గ్రామంలో ఆరునెలలుగా విక్రయం
- పోలీసుల అదుపులో నిందితుడు

వివరాలను వెల్లడిస్తున్న పోలీసు అధికారి

ఖలీల్‌వాడి (మోపాల్), ఫిబ్రవరి 6: మోపాల్ మండలం బాడ్సి గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకొన్నారు. బాడ్సి గ్రామానికి చెందిన కనుగుల ప్రసాద్ ఆదిలాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నిఘా ఉంచారు. ఈ మేరకు మోపాల్ సీఐ సురేశ్, ఎక్సైజ్ సీఐ దిలీప్‌తో కలిసి ప్రసాద్ ఇంటిపై మంగళవారం దాడిచేశారు. ఐదు సంచుల్లో 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. దీని విలువ సుమారు రూ. 6లక్షల 25వేల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయితోపాటు రూ.25వేల నగదు, స్కూటీ, ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నామని, ఆరు నెలల నుంచి గంజాయి విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారేగాం పాఠశాలలో 'గోరుముద్ద' ప్రారంభం

గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కోటగిరి, ఫిబ్రవరి 6: పొతంగల్ మండలం కారేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ (ఆచన్‌పల్లి) ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు 40 రోజుల పాటు అల్పాహారాన్ని (పండ్లు, బిస్కెట్లు, మజా, వివిధ రకాల స్నాక్స్) అందజేస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ శివ నాగేశ్వరావు, పీఆర్టీయూ పొతంగల్ శాఖ మండల అధ్యక్షుడు సూదం వెంకటేశ్ , లయన్స్ క్లబ్ ప్రతినిధులు చక్రవర్తి, వెంకటేశ్వరరావు, హరిబాబు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష

వినాయకనగర్, ఫిబ్రవరి 6: నగరంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఓ వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మహ్మద్ సయ్యద్ ఖదీర్ మంగవారం తీర్పు చెప్పారు. ఈ నెల 4న నిర్వహించిన తనిఖీలో స్థానిక ఖిల్లా ప్రాంతానికి చెందిన షేక్ అబ్బాస్ అనే యువకుడు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. సదరు యువకుడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా అతడికి నాలుగు రోజులు జైలు శిక్ష విధించడంతో జిల్లా సెంట్రల్ జైలుకు తరలించిట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

కోటగిరి, ఫిబ్రవరి 6: పొతంగల్ మండలం హంగర్గాఫారంలోని కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన దిమ్మెకు అదే గ్రామానికి చెందిన షేఖ్ సాజిద్ ఈ నెల 5న రాత్రి లారీని అతివేగంగా నడిపి ఢీకొట్టాడు. దీంతో దిమ్మెతోపాటు నిచ్చెన ధ్వంసమవగా.. షిండే పీరాజీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఖలీల్‌వాడీ, ఫిబ్రవరి 6: జిల్లాలో ఇంటర్మీడియెట్ జనరల్, వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. మూడు స్పెల్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా..మొదటి స్పెల్ ముగిసినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జనరల్ మొత్తం 1302 మంది విద్యార్థులకు 1255 మంది హాజరు కాగా 47 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వొకేషనల్ 592 మందికి 537 మంది విద్యార్థులు హాజరు కాగా 55 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జనరల్ విద్యార్థులు 899 మందికి 868 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వొకేషనల్‌లో మొత్తం 442 మంది విద్యార్థులకు 407 మంది హాజరు కాగా 35 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

■ మోర్తాడ్, ఫిబ్రవరి6: బుధవారం నుంచి ఈనెల 14 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న గ్రామాల్లో రోడ్లు, 8న మురికి కాలువలు శుభ్రం చేయడం, 9న శుక్రవారం డ్రైడేగా పాటించడం, 10న పాడుబడిన బావులు, బోరుబావులను పూడ్చివేయడం, దోమల నివారణకు చర్యలు తీసుకోవడం, 11న ఉపయోగంలో లేని మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావడం, 12న గ్రేవాటర్ నిర్మూలనకు చర్యలు, కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, 13న తాగునీటి వనరుల క్లోరినేషన్, 14న పైప్‌లైన్ లీకేజీలు గుర్తించి బాగుచేయడం, ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించడం కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

■ భీమ్‌గల్, ఫిబ్రవరి 6: బుధవారం నుంచి అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్మ రాజేశ్వర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. డెంగ్యూ వ్యాప్తి చెందకుండా, దోమలు వృద్ధి కాకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా అందరికీ అవగాహన కల్పించాలని, నీటి తొట్టెల్లో పేరుకుపోయిన నీటిని తొలగించాలని సూచించారు.

■ నవీపేట, ఫిబ్రవరి 6: మండలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి సయ్యద్ సాజిద్ అలీ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యలయంలో గ్రామ కార్యదర్శుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, మండల పర్యవేక్షకులు శ్రీనివాస్‌రావు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

■ బోధన్, ఫిబ్రవరి 5: బోధన్ పట్టణంలోని పాత బోధన్‌లో నడిఊరు హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఈనెల 29న ప్రారంభమై మూడు రోజులపాటు కొనసాగుతాయని బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సింగం భాగారెడ్డి, ప్రధాన కార్యదర్శి జల్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, కోశాధికారి కోండ్ర వెంకటి, ఉపాధ్యక్షుడు రుద్ర సత్యనారాయణ, బోధన్ శివాలయ చైర్మన్ బీర్కూర్ బుజ్జి తెలిపారు. మంగళవారం పట్టణంలో కొత్తగా నిర్మాణమైన నడిఊరు హనుమాన్ ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పూజలు, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

■ రెంజల్, ఫిబ్రవరి 6: మండలంలోని తాడ్‌బిలోలికి చెందిన పూజిత పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం బాధితురాలికి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

■ ఎడపల్లి, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు.

■ ఎడపల్లి, ఫిబ్రవరి06: అలీసాగర్ గార్డెన్‌ను జిల్లా విజిలెన్స్ అధికారి నారాయాణ మంగళవారం సందర్శించారు. రూ.50 లక్షలతో చేపట్టిన గార్డెన్ రెయిలింగ్, ఫౌంటేన్ మరమ్మతు పనులను పరిశీలించారు.

■ శక్కర్‌నగర్, ఫిబ్రవరి 6: బోధన్ పట్టణంలోని శ్రీమారుతీ మందిరం షాపింగ్ కాంప్లెక్స్‌లోని 1వ నంబర్ మడిగెకు ఈనెల 14న వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో శ్రీరాం రవీందర్ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

■ భీమ్‌గల్, ఫిబ్రవరి 6: ఉపాధి కల్పన, శిక్షణ శాఖ రాష్ట్ర టీఎన్‌జీవోస్ ఉద్యోగ సంఘ ఎన్నికల్లో రాష్ట్ర ఈసీ మెంబర్‌గా భీమ్‌గల్ ఐటీఐ ఏటీవో భూక్యా తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సృజన్, ఏటీవోలు నిశాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

■ మాక్లూర్, ఫిబ్రవరి 6: రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రతి కార్మికునికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. మానిక్‌బండార్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8న హైదరాబాలో నిర్వహించే ర్యాలీలో కార్మికులు పాల్గొనాలని కోరారు.

■ సారంగాపూర్, ఫిబ్రవరి 6: నగర పరిధిలోని సారంగాపూర్ గ్రామశివారులో ఏర్పాటు చేసిన ఈతవనంలో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించగా..16 ఈత చెట్లు కాలిపోయినట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. వనంలో పదేండ్ల క్రితం ఈతమొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు.

■ ధర్పల్లి, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటి పన్ను వసూలు కార్యక్రమంలో ఎంపీడీవో, ప్రత్యేకాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు.

■ జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 6 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుంచాల విమలరాజు ఆధ్వర్యంలో మంగళవారం సాదాసీదాగా జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో బ్రహ్మానందం, జడ్పీటీసీ తనూజ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముస్కు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

■ జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి06: రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపతి స్పష్టం చేశారు. తొర్లికొండలో రైతులు, ట్రాక్టర్ యజమానులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్సై సుశీల్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో వినోద్

బాల్కొండ, ఫిబ్రవరి 6 : కబ్జాలకు తావు లేకుండా ప్రభుత్వ భూములను కాపాడాలని ఆర్డీవో వినోద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. 1181 సర్వే నంబరు గల స్థల సమస్యను పరిష్కరించాలని పద్మశాలీ కులస్తుల అభ్యర్థన మేరకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 1333 సర్వే నంబరులోని ప్రభుత్వ స్థలంలో కొలతలు చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నలుగురు సర్వేయర్లను కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

అవగాహన కల్పిస్తున్న సీడీపీవో జానకమ్మ

బోధన్, ఫిబ్రవరి 6: నులిపురుగుల నివారణ కోసం బోధన్ పట్టణంతో పాటు డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో పిల్లలకు ఈనెల 12న మాత్రలు వేయాలని బోధన్ ఐసీడీఎస్ సీడీపీవో జానకమ్మ సూచించారు. మంగళవారం బోధన్ పట్టణం రాకాసీపేట్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వేయాలని అన్నారు. 1 నుంచి రెండేండ్ల మధ్య వయస్సు కలిగిన వారికి సగం మాత్ర, అంతకన్నా ఎక్కువ వయస్సు వారికి ఒక మాత్ర వేయాలని సూచించారు. మాత్ర వేసిన అనంతరం విద్యార్థులను పరిశీలించాలని ఆమె చెప్పారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ భారత లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధికా రాథోడ్‌తోపాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

బహుమతుల పంపిణీ

బాల్కొండ, ఫిబ్రవరి 6: కిసాన్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బహుమతులు పంపిణీ చేశారు. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ బడుగు స్వామి, హెచ్ఎం రాజేందర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో గ్రామాల అభివృద్ధి

సాలూరాలో జీపీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న బోధన్ ఎంపీపీ బుద్దెసావిత్రీ రాజేశ్వర్

బోధన్ రూరల్/బాల్కొండ/డిచ్‌పల్లి, ఫిబ్రవరి 6: కేసీఆర్ హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధించాయని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రీరాజేశ్వర్ అన్నారు. శుక్రవారం సర్పంచుల పదవీ కాలం ముగిసిన సందర్భంగా సాలూరా మండల కేంద్రంలో పలు గ్రామాల జీపీ పాలకవర్గాలను మంగళవారం సన్మానించారు. సాలూరా జీపీ పాలకవర్గాన్ని బోధన్ ఎంపీపీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ హయాంలోనే సర్పంచులు అనేక పథకాలను ప్రజలకు చేరవేసి మన్ననలు పొందారన్నారు. కార్య క్రమంలో ఎంపీడీవో పర్భన్న, సాలూరా తహసీల్దార్ మల్లయ్య, రైతు బంధు సమితి మాజీ మండల కన్వీనర్ బుద్దెరాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలూరా షకీల్, శివకాంత్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు. బోధన్ మండలంలోని పెంటకుర్దులో జీపీ పాలకవర్గానికి గ్రామస్తులు సన్మానించారు. బాల్కొండ మండలంలోని చిట్టాపూర్‌లో సర్పంచ్ వనజా గోవర్ధన్ గౌడ్, ఉప సర్పంచును మహిళా సంఘాల సభ్యులు, వీవోలు, సీసీ సరళ సన్మానించారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లి సర్పంచ్ కులాచారి సతీశ్‌రావు, ఉప సర్పంచ్ అజాద్, వార్డు సభ్యులను పంచాయతీకార్యదర్శి సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వీఆర్ఈసీలో ప్రాంగణ నియామకాలు

మాక్లూర్, ఫిబ్రవరి6: మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న వీఆర్ఈసీలో మంగళవారం ఎక్సెల్ ఆర్ సంస్థ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇంటర్వ్యూల్లో నైపుణ్యం చూపిన విద్యార్థులను సంస్థ హెచ్ఆర్ ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, కార్యదర్శి అమృతలతారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణేశ్, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆందోళన

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 6 : మెస్ బిల్లులపై విచారణ చేపట్టాలని కోరుతూ టీయూలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ఏబీవీపీ టీయూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. హాస్టల్ సెక్షన్ అధికారుల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బచ్చనబోయిన శివ మాట్లాడుతూ.. మెస్ బిల్ విషయంలో తప్పుడు లెక్కలు చూపిస్తూ విద్యార్థుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతినెలా విద్యార్థులపై అదనంగా రూ.1200 పుస్తకాల్లో రాస్తున్నారని,వీటిపై తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి సహకరించాలి

శక్కర్‌నగర్/నవీపేట/ముప్కాల్/మోస్రా (చందూర్), ఫిబ్రవరి6: గృహజ్యోతి పథకంలో భాగంగా సర్వేకు రానున్న విద్యుత్‌శాఖ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని బోధన్ ట్రాన్స్‌కో డీఈఈ ముక్తార్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 200 యూనిట్ల కరెంటును ఉచితంగా ఇచ్చేందుకు సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తారని, రేషన్, ఆధార్ కార్డు, సర్వీస్ నంబర్లను సేకరిస్తారని తెలిపారు. బోధన్ రూరల్, రెంజల్ మండలంలోని ప్రజలు కూడా సహకరించాలని ఏడీఈ లక్ష్మణ్ నాయక్ సూచించారు. నవీపేట మండలంలో ఉచిత విద్యుత్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముప్కాల్ మండలంలో బుధవారం నుంచి ఇంటింటికీ విద్యుత్ బిల్లు కొట్టేందుకు వచ్చే సిబ